క్లుప్తంగా

ఇంటింటికీ వెళ్లి దివ్యాంగుల సర్వే



దండుబజార్‌లో పర్యటిస్తున్న వెంకట శేషమ్మ, తదితరులు

విశాఖ లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి దివ్యాంగుల గుర్తింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 24 వరకు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. అందులో భాగంగా తొలి రోజు అవగాహన కల్పించేందుకు దండుబజార్, మహారాణిపేటలో పర్యటించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కేజీహెచ్ పిల్లల వార్డు వైద్యులు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాదులు పాల్గొన్నారు.

మార్చి 4, 5న దివ్యాంగుల శిబిరం



వివరాలు వెల్లడిస్తున్న బాలసతీష్

డాబాగార్డెన్స్: విశాఖ జిల్లాలో చేతులు లేని దివ్యాంగులకు ఇనాలి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ప్రాస్టెటిక్ ఆర్మ్ క్యాంపు మార్చి 4, 5న నిర్వహించనున్నట్టు క్యాంపు కో ఆర్డినేటర్ సి.బాలసతీష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ఆ రెండు రోజులు నగరంలోని మహారాణిపేట నౌరోజీరోడ్డులో గల సింధీ పంచాయితీ హాల్లో శిబిరం నిర్వహించనున్నట్టు చెప్పారు. అవసరమైన దివ్యాంగులకు పూర్తి ఉచితంగా ప్రాస్టెటిక్ అందిస్తామని తెలిపారు. పేద దివ్యాంగుల కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. రిజిస్ట్రేషన్, వివరాల నమోదుకు 9652986007, 7795137999లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో టీఆర్ అనిక్, ఎస్.లావణ్య, అల్తాఫ్ బబ్జన్, సింధీ పంచాయతీ విశాఖ అధ్యక్షుడు మనోహర్ నాగ్‌పాల్ పాల్గొన్నారు.

టూ వీలర్ పార్కింగ్ కేంద్రం ప్రారంభం



పార్కింగ్ ప్రాంతాన్ని ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: పోలీస్ కమిషనరేట్ పరిధి ఆర్మ్‌డ్ రిజర్వ్ బారెక్స్ నందు సిబ్బంది కోరిక మేరకు నిర్మించిన టూవీలర్ పార్కింగ్ కేంద్రాన్ని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది తనకు వాట్సాప్ ద్వారా విన్నవించిన సమస్యకు స్పందించి 120 ద్విచక్ర వాహనాలు నిలుపుకునే పార్కింగ్ కేంద్రం నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సాయుధ బలగాలకు శారీరక దృఢత్వం అవసరం

ఆరిలోవ: సాయుధ బలగాలకు శారీరక, మానసిక దృఢత్వం అవసరమని అనకాపల్లి జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ తెలిపారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలతో విశాలాక్షినగర్ కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో రిజర్వ్ పోలీస్ సిబ్బందికి సోమవారం వార్షిక మొబిలైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పోలీస్ సిబ్బందికి శారీరక దృఢత్వ పరీక్షలు నిర్వహించారు. వివిధ రకాల వ్యాయామాలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితిలో సిబ్బంది సమర్థవంతంగా వ్యవహరించడానికి రిఫ్రెష్‌మెంట్ ట్రైనింగ్ ఎంతో అవసరమన్నారు. ఇలాంటి శిక్షణ సిబ్బందిలో వృత్తి నైపుణ్యం మెరుగుపరుచుకోవడానికి, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఉద్యోగ బాధ్యతతో పాటు వ్యక్తిగత జీవితం, కుటుంబ సంక్షేమం పై కూడా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఆర్ఐలు రామకృష్ణారావు, మన్మథరావు, రమణమూర్తి, అరవింద్ కిషోర్, సంజీవి రావు, ఆర్ఎస్ఐలు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల జీవితాల్లో కారుచీకట్లు



- సంక్షేమ బోర్డు ఏర్పాటు మరచిన కూటమి ప్రభుత్వం
- ఎన్నికల్లో హామీ ఇచ్చి నేటికీ అమలు చేయని చంద్రబాబు
- భవన నిర్మాణ కార్మికులకు కొరవడిన భద్రత
- ప్రభుత్వంపై కార్మికులు, కార్మిక సంఘాల ఆగ్రహం

డాబాగార్డెన్స్: ''భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం. కార్మికులకు వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరిస్తాం. మీ కష్టం మాదే. సహజంగా మరణిస్తే రూ.60 వేలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు చెల్లిస్తాం. అదనంగా మట్టి ఖర్చులకు మరో రూ.20 వేలు... ఇవి కాక మహిళా కార్మికుల తొలి కాన్పుకు రూ.20 వేలు, రెండో కాన్పుకు మరో రూ.20 వేలు చెల్లిస్తాం... ప్రమాదవశాత్తూ అంగవైకల్యం పొందితే రూ.5 లక్షలు అందిస్తాం.. 60 ఏళ్ల దాటిన వృద్ధ కార్మికులకు పెన్షన్ రూపంలో సంక్షేమ బోర్డు ద్వారా సాయం...'' ఇలా సాగిపోయింది ఎన్నికల వేళ చంద్రబాబు హామీల వర్షం. మాయ మాటలతో, అమలు సాధ్యంకాని హామీలతో ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చాక ఆ హామీలన్నీ చంద్రబాబు మరిచిపోయాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు 9 నెలలు కావస్తున్నా... ఇచ్చిన హామీలు ఎక్కడా అమలు చేయడం లేదు. ఫలితంగా భవన నిర్మాణ రంగ కార్మికుల జీవితాల్లో కారు చీకట్లు అలముకున్నాయి. రెక్కాడితే గాని డొక్కాడని వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇసుక కొరతకు తోడు నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరిగిపోవడంతో ఆ ప్రభావం భవన నిర్మాణ రంగంపై పడింది. ఫలితంగా పనులు దొరక్క, కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోక వేలాది మంది కష్టజీవులు రోడ్డునపడ్డారు.

ప్రమాదం జరిగితే దుర్భర జీవనమే

కార్మికుడు పని చేసే చోట ప్రమాదం జరిగితే ఆదుకునే నాథుడే కరువయ్యాడు. మహా అయితే కాంట్రాక్టర్ ఎంతో కొంత ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు తప్ప ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా ఎవరూ కల్పించడం లేదు. ఫలితంగా భవన నిర్మాణ రంగ కార్మికులు ఆర్థికంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు పడతున్నారు. ఆస్పత్రి పాలైనా, మంచానికే పరిమితమైనా అప్పులపాలై మళ్లీ తేరుకోలేకపోతున్నారు. కుటుంబానికి పెద్ద దిక్కులా ఉండే కార్మికుడు మంచాన పడితే వారి బతుకు బండి ముందుకు సాగడం లేదు. ఇంటిల్లపాదీ దుర్భర జీవితం సాగిస్తున్నారు.

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు



ఇసుక కొరతతో పనుల్లేక కార్మికులు ఇంత వరకు బాధలు పడ్డారు. ఇప్పుడిప్పుడే ఇసుక దొరుకుతుందనుకుంటే.. భవన నిర్మాణ రంగ సామగ్రి ధరలకు రెక్కలొచ్చాయి. ధరలు అందుబాటులో ఉంటే ఎవరైనా నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు వస్తారు. నిర్మాణాలు జోరందుకుంటాయి. నిర్మాణరంగ పనివారికి పనులు దొరుకుతాయి. కానీ ఆ ధరలు తగ్గించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు. గతంలో భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డు ఎత్తేశారు. గత ఎన్నికల్లో కూటమి నాయకులు బోర్డు పునరుద్ధరిస్తామని హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. తక్షణమే పునరుద్ధరించి, పెండింగ్‌లో ఉన్న క్లైయిమ్స్ పరిష్కరించాలి.

– కోట సత్తిబాబు, ఏఐటీయూసీ



అల్లిపురం సింహాలదేవిడి వద్ద పనుల కోసం వేచి ఉన్న కార్మికులు



సింగ్ హోటల్ జంక్షన్ వద్ద భవన నిర్మాణ కార్మికులు

సంక్షేమ బోర్డుతోనే భరోసా

గతంలో మాదిరిగా భవన నిర్మాణ రంగ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తే కార్మికుల సాయమందేదనే అభిప్రాయం యూనియన్ నాయకులు వ్యక్తం చేస్తున్నారు. కార్మికుడు ప్రమాదవశాత్తు గాయపడినా, అనారోగ్యంతో మంచానికే పరిమితమైనా సంక్షేమ బోర్డు ద్వారా ఎంతో కొంత ఆర్థికంగా సాయమందేది. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చింది తప్ప ఆ దిశగా నేటికీ ఒక్క అడుగూ ముందుకు వేయలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు సంక్షేమ బోర్డు ఊసే లేదని కార్మికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు పది వేల మందికిపైగా కార్మికులు ఉన్నారు. వారంతా ప్రభుత్వం తీరుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పరిశుభ్రతతోనే నులి పురుగుల నిర్మూలన



చిన్నారులకు మాత్రలు వేస్తున్న గొండు సీతారాం, తదితరులు

అల్లిపురం: పరిసరాల పరిశుభ్రతతోనే నులి పురుగుల నివారణ సాధ్యపడుతుందని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సారథ్యంలో సోమవారం అల్లిపురం మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల ప్రాంగణంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నులి పురుగులు సంక్రమించిన పిల్లలు అనారోగ్యానికి గురవుతారన్నారు. కార్యక్రమంలో కొబ్బరితోట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ ఎ.ఫర్వీన్, స్త్రీ శిశు సంక్షేమశాఖ అదనపు చైల్డ్ డెవలప్‌మెంట్ పీడీ శ్రీలత, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.కనకమహాలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో దుకాణాల సీజ్



దుకాణాలకు తాళాలు వేస్తున్న అధికారులు

సీతమ్మధార: జీవీఎంసీ జోన్ – 4 పరిధి ద్వారకానగర్ టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల పలువురు వ్యాపారులు నెలల తరబడి అద్దెలు చెల్లించకపోవడంతో ఆ దుకాణాలను అధికారులు సోమవారం సీజ్ చేశారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా ఫలితం లేకపోవడంతో జోన్ – 4 రెవెన్యూ విభాగం అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది సోమవారం సీజ్ చేసి తాళాలు వేశారు. టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని 17, 18, 46, 49, 50 నంబర్ దుకాణాల యజమానులు కొంతకాలంగా అద్దెలు చెల్లించకపోవడంతో ఎట్టకేలకు తాళాలు వేశారు. జోన్ – 4 రెవెన్యూ విభాగం ఇన్‌స్పెక్టర్ సీతారామ్ పర్యవేక్షణలో ట్యాక్స్ కలెక్టర్లు, సచివాలయం అడ్మిన్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల ధరలు నియంత్రించాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఐద్వా నాయకులు

మహారాణిపేట: రోజురోజుకీ పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించాలని ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి డిమాండ్ చేశారు. సోమవారం ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అరకొరగా నిత్యావసర సరకులు అందివ్వడం సరికాదన్నారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వం తరహాలో 14 రకాల సరకులను రేషన్ కార్డుపై ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ తెల్ల రేషన్ కార్డు ఇవ్వాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

వైభవంగా లలితా కామేశ్వరుల కల్యాణం



శ్రీలలితాపీఠంలో లలితా కామేశ్వరుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సీతంపేట : శ్రీలలితాపీఠంలో శ్రీలలితా కామేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. పీఠం 76వ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి పర్యవేక్షణలో కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. కుర్తాళం పీఠ పురోహితులు మాచవోలు రమేష్ శర్మ వేద మంత్రాల మధ్య లలితా కామేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తకంగా కల్యాణం చేశారు. లలితా కామేశ్వరుల ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, అభరణాలతో చూడముచ్చటగా అలంకరించారు. ముందుగా లలితా కామేశ్వరులకు పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠం ప్రాంగణాన్ని, లలితాదేవి సన్నిధిని, దర్బారు హాలును వివిధ రకాల పువ్వులు, పండ్లతో ఆకర్షణీయంగా అలంకరించారు. సుముహూర్తం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలు కళ్లకు కట్టినట్టు చూపారు. పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కల్యాణం తిలకించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు, తలంబ్రాలు పంచిపెట్టారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. మంగళవారం ఉదయం లలితా అమ్మవారికి 250 కిలోల అన్నాభిషేకం నిర్వహించనున్నామని, మధ్యాహ్నం 12 గంటల నుంచి అమ్మవారు బంగారు చీర అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని, సాయంత్రం సహస్ర దీపాలంకరణ, సామూహిక కుంకుమ పూజ జరిపిస్తామని పీఠం మేనేజర్ తెలిపారు.

దిగొస్తున్న కూరగాయల ధరలు



రైతుబజార్‌లో టమాటా స్టాల్

సీతమ్మధార : రైతుబజార్లలో కూరగాయల ధరలు దిగొస్తున్నాయి. మాఘమాసంలో వివాహాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో కూరగాయలకు డిమాండ్ అధికంగానే ఉంటుంది. కానీ దిగుబడులు అధికంగా ఉండడంతో ధరలు క్రమేణా తగ్గుముఖం పడుతున్నాయి. ఉల్లిపాయలు కిలో రూ.32కే లభ్యమవడం విశేషం. ఇక దేశవాళీ, హైబ్రిడ్ టమాటా కిలో రూ.12కి తగ్గిపోయింది. కాలీఫ్లవర్, క్యాబేజీ, ఆనపకాయ కిలో రూ.12కే దొరుకుతున్నాయి. అరటికాయలు ఒక్కటీ రూ.7కి విక్రయిస్తున్నారు. బీట్‌రూట్, బద్ద చిక్కుడు కిలో రూ.28 పలుకుతున్నాయి. క్యారెట్ కిలో రూ.30కి, వంకాయలు తెల్లవి రూ.15, పొడవు రకం రూ.18కి దొరుకుతున్నాయి. వెల్లంకి వంకాయలు కిలో రూ.24కి విక్రయిస్తున్నారు. బంగాళాదుంపలు పాతవి, కొత్తవి రూ.16కి విక్రయిస్తున్నారు. కీరదోస కిలో రూ.26 వంతున విక్రయిస్తున్నారు. దేముడు చిక్కుడు కిలో రూ.28గా ఉంది. కూరగాయల ధరలు తగ్గడంతో వినియోగదారులు అధిక పరిమాణంలో కొనుగోలు చేస్తున్నారు. మరో వైపు బెండకాయల ధరలు మాత్రం మండిపోతున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. కిలో రూ.40కి విక్రయిస్తున్నారు. దొండకాయలు కిలో రూ.32కి, బరబాటి రూ.30కి, కాకరకాయలు రూ.40, బీరకాయలు రూ.46, ఆగాకరకాయలు దేశవాళీ రూ.వంద, హైబ్రిడ్ రూ.50 వంతున విక్రయిస్తున్నారు.

జాతీయ మూట్ కోర్టు పోటీల పోస్టర్ ఆవిష్కరణ

విశాఖ విద్య: జాతీయ మూట్ కోర్టు పోటీలు–2025 పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణ రావు, రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు సోమవారం ఆవిష్కరించారు. మార్చి 21 నుంచి 23 వరకు ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు వర్సిటీ లా కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య సీతామాణిక్యం తెలిపారు. జాతీయ మరియు రాష్ట్ర స్థాయిలో వివిధ విశ్వవిద్యాలయాలు/సంస్థల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ నాగరాజ కుమారి, డాక్టర్ ఎల్.వి.కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514కు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 (టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ - యూబీఐఎన్ 0806081)కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

కిక్ బాక్సర్ సతీష్‌కుమార్‌కు సత్కారం




సతీష్‌కుమార్‌ను సత్కరిస్తున్న కిక్ బాక్సింగ్ సంఘాల ప్రతినిధులు

డాబాగార్డెన్స్: దేశ రాజధాని న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన 4వ ఓపెన్ ఇండియా ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో నగరానికి చెందిన వాసుపల్లి సతీష్‌కుమార్ కాంస్య పతకం సాధించడంతో సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో అభినందించారు. ఫౌండేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కిక్ బాక్సింగ్ లీగ్ ప్రెసిడెంట్ టెండి దుర్గ నేతృత్వంలో సత్కరించారు. ఈ సందర్భంగా దుర్గ మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 5 వరకు జరిగిన ఛాంపియన్‌షిప్ పోటీలో 18 దేశాలు పోటీ పడ్డాయని, రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన వాసుపల్లి సతీష్ సూపర్ హెవీ వెయిట్ విభాగంలో కాంస్య పతకం సాధించాడని తెలిపారు. థాయ్‌లాండ్‌లో జరగనున్న అంతర్జాతీయ పోటీల్లో బంగారు పతకం సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు సతీష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ సంఘాల ప్రతినిధులు మొకర నారాయణరావు, రామచంద్రరావు, ఆనంద్‌బాలు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుకకొండపై మాఘ పౌర్ణమి పూజలు రేపు



రమా సహిత సత్యనారాయణస్వామి



ఇసుకకొండపై సత్యదేవుని ఆలయం

డాబాగార్డెన్స్: నగరంలోని ఇసుకకొండ (బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 12న మాఘ పౌర్ణమి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మాఘ పౌర్ణమి సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున స్వామి దర్శనానికి తరలి రానున్న దృష్ట్యా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు ముందుగా సముద్ర స్నానమాచరించి సత్యదేవుడిని దర్శించుకోనున్నారు. నగరం నుంచే కాకుండా జిల్లా నలుమూలలతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుంటారు. ఆ రోజు వేకువజామున 2.30 గంటలకే ఆలయాన్ని తెరిచి, స్వామి ఆరాధనాది కార్యక్రమాల అనంతరం ఉదయం 4 గంటలకు ధ్వజస్తంభం వద్ద పూజలు, 4.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు భక్తులకు దర్శనాలు కల్పించనున్నారు. ఉదయం 7 గంటలకు, 10.30 గంటలకు ప్రత్యేక వ్రతాలు (పూజా రుసుం రూ.1,116), సామూహిక వ్రతాలు ఉదయం 8.30 గంటలకు (పూజా రుసుం రూ.516) నిర్వహించనున్నారు. ఉచిత దర్శనంతోపాటు ప్రత్యేక టిక్కెట్ ద్వారా స్వామి దర్శనం కల్పించనున్నారు. మాఘ పౌర్ణమి సందర్భంగా భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వాహణాధికారి టి.రాజగోపాలరెడ్డి తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా భద్రతా చర్యల కోసం పోలీసులను ఏర్పాటు చేస్తున్నామని, ఉచిత ప్రసాదం పంపిణీ చేయనున్నామని తెలిపారు. భక్తులు పూర్ణామార్కెట్ సమీపాన దయారాం స్వీట్స్ పక్క నుంచి దేవాలయానికి నూతనంగా ప్రారంభించిన ఘాట్ రోడ్డు ద్వారా చేరుకోవాలని సూచించారు.

వైద్యులు సమయపాలన పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట: కేజీహెచ్‌లో వైద్యులు సమయపాలన పాటించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ అన్నారు. సోమవారం కేజీహెచ్‌లో పలు విభాగాధిపతులు, వైద్యులు, ఇతర అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఆస్పత్రిలో విధి నిర్వహణలో ఉండాలని ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. రోజూ ఇక నుంచి ఒక డిప్యూటీ సూపరింటెండెంట్, డీసీఎస్ఆర్ ఎంవోలు ఓపీలను సందర్శించి, అక్కడ వైద్యుల సమయపాలన, రోగుల ఇబ్బందులను ప్రత్యేక ఫార్మేట్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆ నివేదిక ప్రకారం వైద్యులు, నర్సింగ్, ఇతర మెడికల్, పారా మెడికల్ సిబ్బంది విధులపై నిఘా ఉంచుతామన్నారు. కేజీహెచ్‌లో సెక్యూరిటీ సిబ్బంది విధుల మీద కూడ నిఘా ఉంటుందన్నారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ మాధవిలత, డాక్టర్ రాధాకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ (పరిపాలన) సుమతి, తదితరులు పాల్గొన్నారు.

18న వాహనాల వేలం

జగదాంబ: హార్బర్ పోలీసులు స్వాధీనం చేసుకున్న 9 మోటార్ సైకిళ్లను ఇంత వరకు ఎవరూ క్లెయిమ్ చేయని కారణంగా ఈ నెల 18న మహారాణిపేట తహసీల్దార్ సమక్షంలో బహిరంగ వేలం వేస్తున్నట్టు సీఐ సీహెచ్ సింహాద్రి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్మాది జంక్షన్ వద్ద ఉన్న వెహికల్ డంపింగ్ యార్డు వద్ద వేలం నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు పాల్గొనాలని సూచించారు. ఇతర వివరాల కోసం 9440796013, 9705332255లో సంప్రదించాలని సీఐ కోరారు.

ఘనంగా శ్రీ నిత్యానంద త్రయోదశి



పుష్పాలతో అభిషేకం చేస్తున్న పండితులు

ఎంవీపీకాలనీ: శ్రీనిత్యానంద త్రయోదశి ఉత్సవాన్ని ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. శ్రీ నిత్యానంద ప్రభువు దివ్య ఆవిర్భవ దినోత్సవాన్ని పురస్కరించుకుని హరేకృష్ణ మూవ్‌మెంట్, విశాఖపట్నం ఆధ్వర్యంలో సోమవారం ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్యానంద, శ్రీకృష్ణ చైతన్య మహా ప్రభువులకు సప్తనదుల నుంచి సేకరించిన పవిత్ర జలాలతో మహా అభిషేకం చేశారు. అనంతరం 58 రకాల పిండివంటలతో నైవేద్యం సమర్పించారు.